సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం ၊ 19 ၊ ఫిబ్రవరి ၊ 2023



పూల సోయగం

డుంబ్రిగుడ: మండలంలోని కోల్లాపుట్టు పంచాయతీ సమీపంలోని రహదారిలో బూరుగు పూల అందాలు కనువిందు చేస్తున్నాయి.



నూకతాత పండగ చూతము రారండి!

రాజయ్యపేటలో నూకతాత పండగ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 8లో

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

సాక్షి,పాడేరు: జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నా చలిగాలుల తీవ్రత మాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో 16.5 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కాఫీ బోర్డు వద్ద 13 డిగ్రీలు, అరకు లోయ కేంద్ర కాఫీబోర్డులో 14 డిగ్రీలు ఆదివారం నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

23న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట: జిల్లా పరిషత్ **సర్వ సభ్య** సమావేశానికి ఎన్నికల కమిషన్ **అనుమతి** ఇచ్చింది. ఈనెల 23న మధ్యాహ్నం **3 గంట**లకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సు**భద్ర అధ్య**క్షత సమావేశం నిర్వహించేందుకు **సన్నాహాలు** చేస్తున్నారు. వచ్చే నెల 13న **ఉత్తరాంధ్ర** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉ**న్న నేపథ్యం**లో సమావేశ నిర్వహణపై ఇటీవల జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. గతంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించి 90 రోజులు పూర్తి కావడంతో ఈనెల 23న సమావేశం నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ షరతులతో అనుమతి ఇచ్చింది. తీర్మానాలు, అభివృద్ధి పనుల ప్రతిపాదనలు పెట్టరాదని పేర్కొంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పురాతన ఆలయ సందర్శన మహాభాగ్యం

రాష్ట్ర ప్రెస్ అకాడమి కార్యదర్శి ఎంజీ తిలక్



వల్లీసుబ్రమణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకుంటున్న ఎంజీ తిలక్

కూనవరం: మండలంలోని గొమ్ముగూడెం పరిధి కుమారస్వామి గుట్టపై వెలసిన పురాతన శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయాన్ని సందర్శించడం మహాభాగ్యమని రాష్ట్ర ప్రెస్ అకాడమి కార్యదర్శి ఎంజీ తిలక్ అన్నారు. శనివారం రాత్రి ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కూనవరం గ్రామానికి చెందిన ఆయన ఈ ఆలయ ప్రత్యేకతను, చదువుకునే రోజుల్లో నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పొద్దుపోతున్న కొద్దీ భక్తుల రాక పెరగడాన్ని గమనించిన తిలక్ మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో ఉన్నందున పగలు కూలిపనులకు వెళ్లిన వారంతా రాత్రి వేళ స్వామివారి దర్శనానికి వస్తుంటారన్నారు. చదువుకునే రోజుల్లో ఏటా శివరాత్రి ఉత్సవాలు తిలకించేవారమని చెప్పారు. ఆయన వెంట ఎండోమెంట్ చైర్మన్ చిలకం హరనాథ్ ఉన్నారు.

బుడియాల సందడి



ముంచంగిపుట్టులోని వారపు సంతలో విన్యాసాలతో సందడి చేస్తున్న బుడియాలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో బుడియాలు సందడి చేశారు. సుజనకోట గ్రామంలో ఈనెల 20, 21 తేదీల్లో జరిగే గంగమ్మ తల్లి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారర్యాలీ నిర్వహించారు.సుజనకోట ప్రాంతంలో మత్స్యగెడ్డ ఒడ్డున వెలసిన గంగమ్మతల్లికి ఏటా గిరిజన సంస్కృతి,సంప్రదాయాల ప్రకారం ఉత్సవాలు నిర్వహించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా మండలంలో అధిక సంఖ్యలో గిరిజనులు బుడియా మాల ధరించి కర్రలు పట్టుకొని విన్యాసాలు చేస్తూ సందడి చేశారు. సుజనకోట సర్పంచ్ వి.రమేష్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు నాగేశ్వరరావు, మోహన్, గ్రామ పెద్దలు శంకర్రావు, నీలకంఠం, గాసిరావు, సందానందం, రామ్మూర్తి, నానిబాబు, నీలకంఠం, రుక్మధర్, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తజనం

- జనసంద్రంగా మత్స్యగుండం
- బారులు తీరిన భక్తులు
- ఘనంగా శివరాత్రి ఉత్సవాలు
- మత్స్యదేవతలకు ప్రత్యేక పూజలు



మత్స్యగుండంలో మత్స్యదేవతల దర్శనానికి బారులు తీరిన భక్తులు

మహా శివరాత్రి పురస్కరించుకుని జిల్లాలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. శని త్రయోదశి కూడా కావడంతో ఈ ఏడాది శివరాత్రి పర్వదినానికి ప్రాధాన్యత పెరిగింది. వేకువజామునే శివాలయాలకు చేరుకోవడంతో స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. నవగ్రహాలు, శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మత్స్యగుండంలో మెట్ల మార్గంలో భక్త జనసందోహం

సాక్షి,పాడేరు/హుకుంపేట: ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందిన మత్స్యగుండం పుణ్యక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఉత్సవాలు రెండో రోజు శనివారం మహాశివరాత్రి కావడంతో ఆలయ పరిసరాలు భక్తుల రాకతో సందడిగా మారాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు చత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. స్వామివారి దర్శనానికి భక్తులు బారుల తీరారు. నాగదేవతలు, మత్స్యదేవతలను దర్శించుకున్నారు. తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎమ్మెల్యే పాల్గుణ పూజలు

స్వామివారిని, మత్స్యదేవతలను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దర్శించుకున్నారు. పాలాభిషేకం నిర్వహించారు. ఆయనకు ఆలయ అభివృద్ధి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, సర్పంచ్ శాంతికుమారి ఘన స్వాగతం పలికారు. ఆయనకు ప్రసాదం అందజేశారు. సబ్‌కలెక్టర్ అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో ఉత్సవ ఏర్పాట్లపై మాట్లాడారు.హుకుంపేట, గూడెం కొత్తవీధి ఎంపీపీలు కూడా రాజుబాబు, బోయిన కుమారి, హుకుంపేట జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం స్వామివారిని దర్శించుకున్నారు. పాడేరు సబ్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్లు స్వామి వారికి పాలాభిషేకం నిర్వహించారు. గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద తాగునీటిని నిరంతరం సరఫరా చేశారు.

భారీ బందోబస్తు

పాడేరు సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో 20 మంది ఎస్‌ఐలు, 200మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పాడేరు ఆర్టీసీ డిపో నుంచి 15 ప్రత్యేక బస్సులను నడిపింది. మత్స్యగుండానికి రాకపోకలు సాగించేందుకు భక్తులకు పూర్తిస్థాయిలో రవాణా సౌకర్యం కల్పించారు.

ఉచిత భోజనం

భక్తులకు ఉచిత ప్రసాదాలు, మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేశారు. మన్యం ప్రాంత విలేకరుల సంఘం ఆధ్వర్యంలో టమాటా పచ్చడితో పులిహోరను భక్తులకు పంపిణీ చేశారు. సబ్‌కలెక్టర్ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాస్తవ, హుకుంపేట తహసీల్దార్ రాజ్యలక్ష్మి,మఠం సర్పంచ్ శాంతికుమారి భక్తులకు వడ్డించారు. పలు సంఘాల ప్రతినిధులు, గిరిజనులు భక్తులకు మధ్యాహ్నం భోజనం, పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శివలింగాల ప్రదర్శన నిర్వహించారు.

ప్రత్యేక వైద్య శిబిరం..

మత్స్యగుండంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించింది.భక్తులకు వైద్యులు, సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ఉప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి అనూష తెలిపారు. వైద్యశిబిరాన్ని సబ్‌కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ తనిఖీ చేశారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సందర్శించారు. ఎమ్మెల్యేకు కూడా బీపీ పరీక్షలు నిర్వహించారు. జ్వరానికి సంబంధించి మాత్రలు అందజేశారు. సీహెచ్‌వోలు అమూల్య, స్వప్న, మౌనిక, హెచ్‌వీ పద్మ పాల్గొన్నారు.

బొర్రాలో శివనామస్మరణ

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహల్లో కొలువైన జ్ఞానకేశ్వరుడు ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ఆలయం వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. చత్తీస్‌గఢ్, ఒడిశా, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు. రాత్రంతా జాగరం చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో బొర్రాగుహలు ప్రాంగణం రద్దీగా మారింది. దుకాణాలు కళకళలాడాయి. పంచాయతీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, బొర్రాగుహల వద్ద పర్యాటకశాఖ సిబ్బంది ఒడియా భాగవతం, థింసా నృత్యాలు ఏర్పాటుచేశారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ అరుణ తదితరులు పర్యవేక్షించారు.



మత్స్యదేవతలను దర్శించుకుంటున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తదితరులు

రంప ఆలయానికి భక్తుల తాకిడి

రంపచోడవరం: రంపలో వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రంప కొండపై ఉన్న జలపాతం వద్ద భక్తులు తెల్లవారు జామునుంచే స్నానాలు ఆచరించి శివలింగాన్ని దర్శించుకున్నారు. రాత్రి స్వామివారి కల్యాణం అర్చకుడు ప్రసన్నకుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. రంపచోడవరం డీఎఫ్‌వో నరేంధిరన్ కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. రంపచోడవరానికి చెందిన భాను, సప్లయర్స్ శ్రీను ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

ఉమానీలకంఠేశ్వరునికి పట్టు వస్త్రాల సమర్పణ

సాక్షి,పాడేరు: జిల్లాకేంద్రమైన పాడేరులో ఉమానీలకంఠేశ్వరస్వామి వారికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో బమ్మిడి ఆనందరావు, నాగవల్లి, సాధనాల గోపినాయుడు, ఈశ్వరమ్మ, కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి, చిత్తలూరు శ్రీనివాసరావు,సీతారత్నం దంపతులు ఏర్పాటుచేసిన సుబ్రమణ్యస్వామి,అయ్యప్ప స్వామి విగ్రహాలను ఎమ్మెల్యే దంపతులు ఆవిష్కరించారు.భక్తుల సహకారంతో ఆల య కమిటీ ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, కమిటీ ప్రతినిధు లు ఉప్పల వెంకటరత్నం, కొట్టగుళ్లి రామారావు, కొట్టగుళ్లి నాగేంద్ర, బోనంగి రమణ, శివరాత్రి శ్రీని వాసరావు, దాసరి నాగు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యా యులు, పాడేరు వర్తక సంఘం నేతలు పాల్గొన్నారు.



విగ్రహాల ఆవిష్కరణలో ఎమ్మెల్యే పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి,డాక్టర్ నర్సింగరావు



పూజలు చేస్తున్న పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాస్తవ



పెదగూడ శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



మత్స్యగుండంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు





బొర్రా గుహల వద్ద కొలువైన జ్ఞానకేశ్వరుడు, దర్శించుకుంటున్న భక్తులు



రంప ఆలయం వద్ద క్యూలో నిల్చున్న భక్తులు



నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



మత్స్యగుండం జాతరకు వచ్చిన భక్తజనం

పీడీఎస్ బియ్యం పట్టివేత

2.8 టన్నుల స్వాధీనం



పట్టుబడిన పీడీఎస్ బియ్యంతో రాజవొమ్మంగి తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి, సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని అమీనాబాద్ పంచాయతీ వణకరాయి సెంటర్ నుంచి పెద్దాపురం వైపు మినీ వ్యాన్‌లో తరలిస్తున్న 2.8 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యాచారి తెలిపారు. పెద్దాపురానికి చెందిన మన్యం రవితేజ అనే వ్యక్తి మన్యం నుంచి మైదాన ప్రాంతానికి తరలిస్తున్నట్టుగా అందిన సమాచారం మేరకు నిఘా పెట్టి పట్టుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.84 వేలు ఉంటుందని తహసీల్దార్ తెలిపారు.



సీజ్ చేసిన వాహనంతో తహసీల్దార్ రామకృష్ణ

స్వాధీనం చేసుకున్న 102 బియ్యం బస్తాలను జడ్డంగిలోని ఎంఎల్‌సీ గొడౌన్‌కు తరలించినట్టు చెప్పారు. మినీ వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

దేవీపట్నంలో 750 కిలోలు..

దేవీపట్నం: అక్రమంగా తరలిస్తున్న పీడీఎఫ్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు శనివారం సాయంత్రం పట్టుకున్నారు.వాహనంలో తరలిస్తున్న 750 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఇందుకూరుపేట నుంచి గోకవరం బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్టు తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. వ్యాన్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఆయన వివరించారు.

టీడీపీలో బీసీలకు అన్యాయం

- నా సీటును అడ్డుకుంది అయ్యన్నపాత్రుడే
- ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ టీడీపీ రెబల్ అభ్యర్థి ఈర్లె శ్రీరామమూర్తి



సాక్షి,పాడేరు: టీడీపీలో బీసీలకు అన్యాయం జరుగుతోందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ టీడీపీ రెబల్ అభ్యర్థి ఈర్లె శ్రీరామమూర్తి అన్నారు. శనివారం పాడేరులో పర్యటించిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు వైఖరి వల్లే తనకు ఎమ్మెల్సీ సీటు రాలేదని మండిపడ్డారు.40 ఏళ్ల నుంచి టీడీపీలో పనిచేస్తున్నానని, పట్టభద్రుల ఎమ్మెల్సీ సీటు ఇస్తానని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. రెండు నెలల క్రితం టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీసీ మహిళను ప్రకటిస్తే సంతోషించానన్నారు. ఆమెను రెండు నెలలుగా పని చేయించి, ఖర్చులు కూడా పెట్టించారని, ఇంతలో ఆమెను మార్చి ఓసీ అభ్యర్థికి ఎమ్మెల్సీ సీటును కేటాయించడం అన్యాయమన్నారు. నా రాజకీయ ఎదుగుదల చూడలేని అయ్యన్నపాత్రుడు చంద్రబాబునాయుడుకు తప్పుడు సమాచారం ఇచ్చి ఎమ్మెల్సీ సీటును అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర అంటే బీసీలని, టీడీపీలో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. తన సన్నిహితులు సూచనల మేరకు టీడీపీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నానని, పట్టభద్రులంతా తనకే మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరారు.

కమనీయం.. మత్స్యలింగేశ్వరుని కల్యాణం



మత్స్యగుండంలో మత్స్యలింగేశ్వరస్వామి,పార్వతీదేవికి నిర్వహిస్తున్న కల్యాణం

సాక్షి,పాడేరు: మత్స్యగుండం మత్స్యలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. మఠం గ్రామం నుంచి అన్నివర్గాల గిరిజనులు మత్స్యలింగేశ్వర స్వామి, పార్వతీదేవిల ఉత్సవ విగ్రహాలను గిరిజన సంప్రదాయంలో ఊరేగించారు. అనంతరం మత్స్యగుండం శివాలయంలో కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో పలువురు దంపతులు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షురాలు, సర్పంచ్ మఠం శాంతికుమారి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సింహాచలంనాయుడు, మినుముల గోపాలపాత్రుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పాంగి మత్స్యకొండబాబు, ఉపాధ్యక్షుడు వంతాల ఈశ్వర్,కోశాధికారి మఠం రాంబాబునాయుడు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆశ్రమ విద్యార్థిని మృతి



కవిత మృతదేహం

జి.మాడుగుల: మండలంలో బందవీధి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలకు చెందిన ఆరవ తరగతి విద్యార్థిని కొర్రా కవిత (11)అనారోగ్యంతో శుక్రవారం అరగడాపల్లిలో ఇంటి వద్ద మృతి చెందింది. బందవీధి ఆశ్రమ పాఠశాలలో కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా ఈ నెల 2న ఆశ్రమ పాఠశాలలో జరిగిన వైద్యశిబిరంలో పాఠశాల యాజమాన్యం వైద్యం చేయించారు. విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లారు. మెరుగైన వైద్యం కోసం తమతో పంపమని కోరగా ఆశ్రమ పాఠశాలలోనే వైద్యం చేయిస్తామని చెప్పి పాఠశాల యాజమాన్యం తమను పంపించేసిందని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమ కుమార్తె కవిత ఆరోగ్యం బాగులేకపోవడంతో సెలవుపెట్టి ఈనెల 3వ తేదీన ఇంటికి వచ్చేసిందని వారు వివరించారు. కవితకు ప్రైవేట్ వైద్యం అందించినట్టు వారు తెలిపారు. ఆమెకు జ్వరంతో పాటు పచ్చకామెర్లు సోకడంతో ఆరోగ్య పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందింది.

గిరి రైతుల శ్రేయస్సే ధ్యేయం

ముంచంగిపుట్టు: గిరి రైతుల శ్రేయస్సే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని వనభసింగి పంచాయతీ కొత్తూరులో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో అధ్వర్యంలో ఐదుగురు మిరియం రైతులకు 75 శాతం స్పైసీ బోర్డులను శనివారం ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిపెల సీతమ్మ, వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, జర్రెల సర్పంచ్ నాయకం భాగ్యవతి, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

నాడు అధ్వానంగా .. నేడు అద్దంలా

- జనంగూడ రహదారికి మోక్షం
- ఎమ్మెల్యే చొరవతో రూ.5కోట్లతో పనులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న గిరిజనులు



నాడు అధ్వానంగా ఉన్న జనంగూడ రోడ్డు



నూతనంగా నిర్మించిన జనంగూడ గ్రామం తారురోడ్డు

అరకులోయ రూరల్: కొన్ని దశాబ్దాలుగా కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోని గ్రామాలకు రహదారులు, తాగునీటి సౌకర్యం పనులు జరుగుతుండడంపై గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. కోట్లాది రూపాయలు మంజూరు చేస్తున్నారు. ప్రభుత్వ సహకారం, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి జరుగుతుండడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

శివారు గ్రామాలకు తారురోడ్డు

మండలంలోని జనంగూడ గ్రామం నుంచి తోటవలస, దాబుగూడ, సంఘంవలస, దుక్కగూడ, దండబాడు గ్రామాల మీదుగా కినంగూడ గ్రామం వరకు సుమారు 4 కిలోమీటర్ల రహదారి పనులతో పాటు ఆయా ప్రాంతాల్లో వంతెనలు నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో రింగురోడ్డుగా రవాణా సౌకర్యం అందుబాటులో వచ్చింది. గతంలో అయా గ్రామస్తులకు కనీస సౌకర్యాలు, రవాణా సదుపాయం లేక కాలినడతోనే ప్రయాణించేవారు. గత టీడీపీ హయాంలో ఆయా ప్రాంతవాసులు రహదారి కోసం పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా అభివృద్ధి జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు జరుగుతుండడంపై గిరిజనుల ఆనందానికి అవధుల్లేవు.

నాణ్యత పాటిస్తూ పనులు

మండలంలో జరుగుతున్న అభివృద్ధి, రహదారి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకున్నాం. తరచూ పనులు పరిశీలిస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు చేపడుతున్నాం.

–గౌరీనాయుడు, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ, అరకులోయ మండలం

సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం



మా గ్రామల్లో రహదారి సౌకర్యం వస్తుందని అనుకోలేదు. గత టీడీపీ హయాంలో ఆశలను వదులుకున్నాం. జగనన్న ప్రభుత్వం సహకారంతో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రత్యేక చొరవతో తారురోడ్డు సౌకర్యం వచ్చింది. ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

–కుంబిడి ప్రతాప్, కినంగూడ గ్రామం, సుంకరమెట్ట పంచాయతీ, అరకులోయ

కళ్యాణపులోవ, పుణ్యగిరికి ప్రత్యేక బస్సులు

అనకాపల్లి టౌన్: మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున అనకాపల్లి డిపో నుంచి కళ్యాణపులోవ, పుణ్యగిరిలకు 50 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్.సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సాధారణ చార్జీలతోనే ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్టు చెప్పారు. బస్ బుక్ చేసుకున్న భక్తులకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చామన్నారు.

పసికందు మృతి ఘటనలో సీసీ ఫుటేజ్ పరిశీలన

మహారాణిపేట: కేజీహెచ్‌లో పసికందు మృతి, ద్విచక్ర వాహనంపై మృతదేహం తీసుకెళ్లిన ఘటనకు సంబంధించి ఆస్పత్రిలోని మెయిన్ గేటు, పిల్లల వార్డు, క్యాజువాల్టీ ఎస్టి సెల్ తదితర విభాగాల్లో సీసీ ఫుటేజీలను సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఆర్ఎంవో డాక్టర్ వాసుదేవ శనివారం పరిశీలించారు. ఈ ఘటనపై నియమించిన కమిటీ సభ్యులు డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, ఆర్ఎంవో డాక్టర్ వాసుదేవ సోమవారం నుంచి విచారణ చేపట్టనున్నారు. ప్రభుత్వ వైద్యులు, నర్సులు, సెక్యూరిటీ సిబ్బంది, ఎస్టీ సెల్ సిబ్బందిని విచారించనున్నారు. కేజీహెచ్ పిల్లల వార్డులో పసికందు మృతి సమయంలో డ్యూటీలో ఉన్న హెడ్ నర్సు, స్టాఫ్ నర్సులకు సూపరింటెండెంట్ ఛార్జ్ మెమో జారీ చేశారు.

ప్రయోగ పరీక్షలకు వేళాయె..!

- రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- ఈ సారి నాన్ జంబ్లింగ్ విధానంలోనే
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 207 కేంద్రాలు
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహణ



ప్రాక్టికల్స్‌కు సిద్ధమవుతున్న పెందుర్తిలోని ఒకేషనల్ కాలేజీ విద్యార్థులు

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలకు అంతా సిద్ధమైంది. సోమవారం ఒకేషనల్, ఈ నెల 26 నుంచి జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ఏప్రిల్ 7 వరకు జరగనున్నాయి. ఈ సారి నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కేంద్రాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరగనున్నాయి. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఇంటర్మీడియట్ ఆర్ఐవో కార్యాలయంతోపాటు, కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. కేంద్రాల్లోని చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లతోపాటు, ఉన్నతాధికారులు సైతం పరీక్షలపై నేరుగా పర్యవేక్షణ చేయనున్నారు.

ప్రాక్టికల్స్ పరీక్షలకు 21,279 మంది

విశాఖపట్నంలో 126 కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఇక్కడ ఎంపీసీ 11,079 మంది, బైపీసీ 2,655 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నారు. అదేవిధంగా అనకాపల్లిలోని 65 కేంద్రాల్లో ఎంపీసీ 4,187 మంది, బైపీసీ 1,575 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 16 కేంద్రాల్లో ఎంపీసీ 1,173 మంది, బైపీసీ 610 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు పూటలా ప్రయోగ పరీక్షలు జరుగుతాయి.

207 కేంద్రాల్లో నిర్వహణ

ప్రాక్టికల్స్ పరీక్షలు ఈ సారి నాన్ జంబ్లింగ్ విధానంలోనే జరుగుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 355 జూనియర్ కాలేజీలు నిర్వహిస్తుండగా, విద్యార్థుల సంఖ్య, వసతులు, అందుబాటులో ఉన్న ల్యాబ్‌లను దృష్టిలో ఉంచుకొని పరీక్షల కోసం 207 కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాన్ జంబ్లింగ్ విధానంలో ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తుండటం, 153 ప్రైవేటు కాలేజీల్లో కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఇలాంటి చోట్ల పటిష్టమైన నిఘా పెట్టారు. ఇంటర్మీడియట్ మార్కుల ప్రాధాన్యత దృష్ట్యా ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు.

నూకతాత పండగ చూతము రారండి!

- నేటి నుంచి భారీ స్థాయిలో తిరునాళ్లు
- రాజయ్యపేటలో ఘనంగా ఏర్పాట్లు



రాజయ్యపేటలో నిర్మించిన నూకతాత ఆలయం

నక్కపల్లి: మత్స్యకారుల ఆరాధ్య దైవం, గ్రామీణ జిల్లాలో ప్రసిద్ధి గాంచిన రాజయ్యపేట నూకతాత పండగను రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా ఈ పండగను శివరాత్రి పురస్కరించుకుని మత్స్యకారులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. ఆదివారం సాయంత్రం నుంచి భారీ స్థాయిలో తిరునాళ్లు ప్రారంభమవుతాయి. తీర ప్రాంతంలో అత్యంత ఘనంగా జరిగే పండగ కావడంతో మత్స్యకారులతోపాటు, ఇతర సామాజిక వర్గాల వారు, చుట్టుపక్కల గ్రామాలవారు వేల సంఖ్యలో తరలివస్తారు. పూర్వీకుల నుంచి మత్స్యకారులు నూకతాతను తమ కులదైవంగా భావిస్తారు. గ్రామంలో ప్రత్యేకంగా నూకతాత ఆలయాన్ని నిర్మించి విగ్రహాలను ఏర్పాటు చేశారు. శివరాత్రి అమావాస్య (సోమవారం) రోజున నూకతాత విగ్రహాలను సముద్ర స్నానానికి తీసుకెళ్తారు. స్నానం అనంతరం విగ్రహాలను పూజారులు ఆలయానికి తీసుకువస్తున్న సమయంలో రోడ్డుపై వందలాది మంది మత్స్యకారులు పడుకుంటారు. వారిపై పూజారులు దాటుకుంటూ వెళ్తారు. ఇలా వెళ్తే తమ కష్టాలు గట్టెక్కి కోరిన కోర్కెలు తీరుతాయినేది మత్స్యకారుల విశ్వాసం.

జంతుబలి నిషేధం....

నూకతాత పండక్కి మాత్రం జంతుబలి నిషేధం. ఈ పండగ నాడు నెత్తురు కనబడితే నూకతాత అగ్రహం చెందుతాడని గ్రామస్తులు చెబుతున్నారు. పండ్లు, శనగపప్పు మాత్రమే నైవేద్యంగా సమర్పిస్తారు. ఏడాదికొకమారు జరిగే ఈ పండక్కి ఉద్యోగ, వ్యాపార, వత్తి రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు రాజయ్యపేట చేరుకుంటారు. బంధువులు, స్నేహితులు రాకతో మత్స్యకారుల ఇళ్లన్నీ సందడిగా ఉంటాయి. ఈ పండగను తిలకించేందుకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది తరలి వస్తారు.

వాహన చోదకులపై 390 కేసులు నమోదు

రూ.79,300 జరిమానా వసూలు

అనకాపల్లి టౌన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మద్యం, ఇసుక, గంజాయి, పశువుల అక్రమ రవాణా, కోడిపందాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై దాడులు నిర్వహించినట్టు ఎస్పీ గౌతమి సాలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంవీ చట్టాన్ని ఉల్లంఘించిన వాహన చోదకులపై 390 కేసులు నమోదు చేసి రూ.79,300ల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. కోడిపందాలు ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2,370లు స్వాదీనం చేసుకున్నామని చెప్పారు. సెబ్ అధికారులు దాడులు నిర్వహించి 7 కేసులు నమోదు చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారని, 300 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసి, 26 లీటర్ల నాటుసారా, ఒక లీటర్ అక్రమ మద్యంను స్వాధీనం చేసుకున్నారని ఆమె చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ప్రజాశాంతికి ఆటంకం కలిగించిన 30మందిపై, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 16మందిపై కేసులు పెట్టామన్నారు.